

# ఎందుకే నీకింత తొందరా...

– బలభద్రపాత్రుని రమణి



## పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
## కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
## బహుమతి పొందిన ఉత్తమ నవల
## (గత సంచిక తరువాయి)

**జీవితం మారడానికి** ఒక్క క్షణం చాలు. ఆ క్షణం అదే... అతని తలని వంచి అతని పెదవులని అందుకున్నాను.

❦❦❦

యాషిక స్టీరింగ్ పట్టుకున్న నా చేతి వేళ్ళ వైపే చూస్తోంది.

"ఏమిటే అంత నెర్వస్‌గా వున్నావు?" అడిగింది.

"మొదటిసారి క్లాస్ కి వెళ్ళే ఎల్.కే.జి పిల్లలావుందే నాకు" అన్నాను.

"అమ్మయ్య.. డ్రైవింగ్ మర్చిపోయా అంటావేమో అని కంగారు పడ్డాను" అంది.

రోడ్ వైపే చూస్తున్నాను. దాదాపు నగరం ఎండ్ అయిపోయే అంచున వున్నాం. కారుకి అడ్డం పడ్తున్న మేకల మందలూ, అప్పుడప్పుడూ మమ్మల్ని చెక్ చేస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్లలాంటి వాళ్ళూ, రోడ్డు మధ్యలో పశువులూ తప్ప నరసంచారం పెద్దగాలేదు. నల్ల కంబళలూ, గోచీపోసి చీర కట్టుకున్న వాళ్ళు, కొంతమంది తాడి చెట్ల కింద కుండలు పెట్టుకుని బేరాల కోసం చూస్తున్నారు.

ఏదో కూనిరాగం తీస్తున్న యాషిక "ఓసారి అది ట్రై చేద్దామా?" అంది.

కోపంగా చూసాను.

"నీరా అని ఫ్రెష్ తాటికల్లువంటికి చాలా మంచిదిట తెలుసా?" అంది.

"మాది ఫల రసాయనం కూడా మంచిదే .. రోజూ తాగుతున్నావా? అడిగాను.

"నిన్నెవరు భరిస్తాడో కానీ చచ్చాడన్నమాటే" అంది.

"నువ్వింకా అతన్ని చూడలేదు కాబట్టి ఈ మాట అంటున్నావ్" అన్నాను.

"నీకన్నా గాన్ కేసా?" అడిగింది.

బస్‌స్టాప్ లాంటిది, ఓ చిన్న టీ బడ్డీ కనిపిస్తే ఆపి "షెం షేర్ పేట్ రోడ్ ఇదేనా?" అడిగాను.

పంప్ స్టౌకి పంప్ కొడ్తున్న అతను తల ఎత్తకుండానే "ఇదే" అన్నాడు.

"ఇక్కడ పురాణ అనే స్కూల్ ఎక్కడో తెలుసా?" అన్నాను.

"దేవ్ సార్ దా?" పక్కన నిలబడి టీకోసం వెయిట్ చేస్తున్న కస్టమర్ అడిగాడు.

"అవును" అన్నాను.

"ఇంకా బాగా ముందుకి పోయి, ఎడమ చేతి దిక్కుకెల్లి టర్న్ తీసుకోవాల.. బోర్డ్ కానొస్తది" అన్నాడు.

"థాంక్స్" చెప్పి కార్ స్పీడ్ పెంచాను.

"ఫోన్ చేసి ఎపాయింట్‌మెంట్ తీసుకున్నావా?" అడిగింది ఓరియో బిస్కెట్ తింటూ యాషీ.

"లేదు. నాకూ ఆయనకీ కూడా సర్‌ప్రైజే" అన్నాను.

"నీకు సర్‌ప్రైజ్ సరే. ఆయనకి ఎందుకే పాపం పెద్దాయన ముందుగా చెప్పాల్సింది" అన్నాను.

"ఆయన రియాక్షన్ చూడాలంటే అంత ప్రిపరేషన్ టైం ఇవ్వకూడదు" అన్నాను.

"చూడబోతే ఆయనని ఇంటర్వ్యూ చేస్తున్నట్లున్నావ్? హూ! కానీ" అంది.

'పురాణ స్కూల్ ఆఫ్ కల్చర్' అన్న బోర్డ్ కనపడింది.

అందరూ వైట్ యూనిఫార్మ్ వేసుకుని వున్నారు. టీచర్లూ, సార్లూ కూడా పిల్లలతోబాటు.

పిల్లలు కొందరు యోగా చేస్తున్నారు.

కొందరు శ్రద్ధగా మొక్కల్లో కలుపు ఏరుతున్నారు. ఇంకా కొందరు పిల్లలు దూరంగా ఫుట్‌బాల్ కోర్ట్‌లో ఆడుతూ కనిపిస్తున్నారు.

మేం రిసెప్షన్ దగ్గరకెళ్ళి "దేవ్ సార్‌ని కలవాలి" అన్నాం.

"ఎపాయింట్‌మెంట్ వుందా?" పెద్దాయన కళ్ళజోడు ముక్కుమీదకి జారిపోతే, దానిమీదనుండి మా ఇద్దర్నీ మార్చి మార్చి చూస్తూ అడిగాడు.

"లేదు" అన్నాను.

"సార్ ఈ రోజు ఎవరినీ కలవరమ్మా. మరీ అవసరమైతే తప్ప. బుధవారం ధ్యానంలోవుంటారు" అన్నాడాయన.

"నేను చాలా దూరం నుండి వచ్చాను. ద్వారక పంపించారు అని చెప్పండి" అన్నాను.

"ఎవరూ?" అన్నారాయన.

"ద్వారకానందన్" అన్నాను.

ఆయన ఓ స్లిప్ నావైపు తోసి "మీ పేరు, పర్పస్ రాసివ్వండి. అదృష్టం వుంటే కలుస్తారు" అన్నారు.

అలాగే రాసిచ్చాను.

"రుష్యేంద్రమణి.. పాతకాలం పేరు. బావుంది" అన్నాడాయన.

పిల్లలు శ్లోకాలు వల్లెవేస్తున్నారు.

స్కూల్లో గోడలకి రామాయణ, మహాభారతాల చిత్రాలూ, కింద కథ రాసి వున్నాయి. గార్డెన్‌లో ఫౌంటెన్ దగ్గర నల్లరాతి బుద్ధుడి విగ్రహం వుంది. మొత్తం పరిసరాలన్నీ చాలా ప్రశాంతంగా వున్నాయి.

"ఇక్కడ ఓ గంట వుంటే మనం కూడా బుద్ధిమంతులం అయిపోం కదా!" అంది యాషిక.

మేం అక్కడున్న బెంచ్ మీద కూర్చుని సెల్ ఫోన్ సిగ్నల్స్ చెక్ చేసుకుంటుంటే, అందడం లేదని తెలిసింది.

ఇంతలో ప్యూన్ వచ్చి "సార్ రమ్మంటున్నారమ్మా" అన్నాడు.

'అమ్మయ్యా' అనుకుంటూ అతని వెంట వెళ్ళాం. గడ్డిలో నడుస్తూ చాలా దూరం వెళ్ళాక "ఇక్కడ చెప్పులు తీసెయ్యాలి" అన్నాడతను.

చెప్పులు తీసేసి గరిక మీద నడుస్తుంటే తెలిసింది. శరీరాన్ని ప్రకృతిని తాకనివ్వాలి అప్పుడే ఆనందం అర్ధమవుతుందని.

డోర్ తీసి "రండి" ఆ గొంతుకి ఉలిక్కిపడ్డాం. మృదంగం మీద తంగున వాయించినట్లూ, గుడిలో సడెన్‌గా జేగంట మోగినట్లూ వుంది ఆ స్వరం.

ఎదురుగా తెల్ల బట్టల్లో, పొడవాటి గెడ్డంలో, ద్వారకేనా అన్నంత పోలికలతో, సాల్ట్ అండ్ పెప్పర్‌లా వున్న పొడవాటి జుట్టుతో దేవేంద్రనాధ్ కనిపించారు.

వ్యాసుడూ, వాల్మీకీ ఇలా వుంటారేమో అనిపించింది. నాకు ఎప్పుడూ గాడ్‌మెన్‌తో అవసరం పడుతుంది అని కానీ, వాళ్ళతో ఇలా బిహేవ్ చెయ్యాలనికానీ అనుకోలేదు.

"కూర్చోండి" ఆయన తనముందు జాగా చూపించారు.

గచ్చుమీదే కింద కూర్చున్నాం.

"ద్వారక నాకు ఫ్రెండ్" అన్నాను.

"తెలుసు" అన్నారు.

ఉలిక్కిపడి చూసాను.

ఆ అమ్మాయికి నామీద ఏ మాత్రం ఇంట్రెస్ట్ వున్నా, నిన్ను కలవడానికి వస్తుంది నాన్నా అన్నాడు" అని చిన్నగా నవ్వారు.

'ఓ మై గాడ్' ద్వారకకి వయసు పెరిగాక అచ్చు ఇలాగే ఉంటాడు. ఇలాగే గెడ్డం పెంచమని అడగాలి అనుకున్నాను.

"ద్వారక గెడ్డంతో బావుంటాడు" అన్నారు.

ఉలిక్కిపడ్డాను. నేనేదో మాయలూ, మంత్రాలూ తెలిసిన వ్యక్తి సమక్షంలో లేను కదా! అనిపించింది.

"జస్ట్ మైండ్ రీడింగ్..అంతే. చాలాసేపు ధ్యానం చెయ్యడం వల్ల కుండలినీ శక్తి వస్తుంది. ఇతరుల బాడీ లాంగ్వేజ్ వల్ల వారి మనసులో మాటలు అర్ధం అవుతాయి" అన్నారు.

"అర్ధం అయ్యాకా?" అడిగాను.

"వాట్?" అన్నారు అర్ధంకానట్లు.

"అర్ధం అయ్యాక వాళ్ళ ప్రోబ్లెమ్స్ సాల్వ్ చేస్తారా? పరిష్కారం చూపిస్తారా?" అడిగాను.

ఆయన నవ్వి "నేను బాబాని కాదు. సాధన చేస్తాను కానీ తాంత్రికుడ్ని కాదు" అన్నారు.

"ఈ ప్రశాంతత కోసం కుటుంబాన్ని విడిచిపెట్టి పారిపోయి వచ్చేసారా ఇంతదూరం. ఈ ఆశ్రమం.... పటాటోపం వుంటే కానీ ప్రశాంతత కుదరలేదా?" అడిగాను.

నా మాటలకి ఆయన కనుబొమ్మలు ముడిపడ్డాయి. యాషిక బెదిరిపోయి చూస్తోంది.

"నాతో రామ్మా" ఆయన లేచి నిలబడ్డారు.

యాషిక అక్కడే వుండిపోయింది.

ఇద్దరం ఆ ద్వారంలోంచి బయటకి వచ్చాం. నడుస్తూంటే, స్టూడెంట్స్ వచ్చి ఆయనకి పాద నమస్కారం చేసి వెళ్తున్నారు.

"నాకు అమెరికా జీవిత విధానం సరిపడలేదు. నా రూట్స్ అవికాదు. వేద విజ్ఞానం, మన పురాణాలు అన్నీ క్షుణ్ణంగా చదివి, వాటిలో దాగున్న అమూల్య నిధులు, యోగా, ధ్యానంలాంటివి భావితరాలకి పంచాలనిపించింది. సరిగ్గా అప్పుడే నా తల్లి తండ్రులు ముసలితనం వల్ల జబ్బు పడ్డారు. దేవకిని ఇండియా వెళ్ళిపోదాం అంటే 'సిటిజెన్ షిప్‌కోసం ఎంత కష్టపడ్డాం? ఆర్ యూ మేడ్?" అంది. నా పిచ్చితనం నన్ను ఇలా వచ్చెయ్యమంది. ద్వారకను పిలిపించుకున్నాను.. వాడు వచ్చినప్పుడు ఎంతో సంతోషంగా ఉన్నాడు. కొంత కాలం అయ్యాక 'అమ్మకి నా అవసరం వుంది నాన్నా వెళ్తాను' అంటే పంపించాను.

చూడు ఈ పాఠశాల నుండి వెళ్ళిన ఎందరో విద్యార్ధులు ఐ.ఏ.ఎస్‌లు అవుతున్నారు. ఐ.పి.ఎస్‌లూ, డాక్టర్లూ, సైంటిస్టులూ అవుతున్నారు. అవన్నీ చూస్తే నాకు సంతోషంగా వుంటుంది. నేను అనుకున్నది సాధించానన్న తృప్తి వుంటుంది" అన్నారు.

"మీ అబ్బాయి అటు తల్లికీ ఇటు తండ్రికీ న్యాయం చెయ్యలేనని కుమిలిపోతున్నాడు. పెళ్ళీ, కుటుంబ వ్యవస్థ అంటేనే భయపడిపోతున్నాడు. సహజంగా బతకలేకపోతున్నాడు. మీ తృప్తివల్ల, మీ బట్టలవల్ల రుషిగా కీర్తింపబడుతున్నారు. దేవకిగారు గుణాలవల్ల రుష్యత్వం సిద్ధించుకున్నారు. అన్నీ సక్రమంగా చేసారు. ఆడపిల్లని ఎలా గౌరవించాలో, ఎలా ప్రేమించాలో కొడుకుకి నేర్పించారు. నడవలేకపోయినా కుటుంబాన్ని నడిపిస్తూనే వున్నారు. ఇలా

బాధ్యతల నుండీ, బంధాలనుండీ ప్రశాంతత కావాలని ముక్కు మూసుకుని ధ్యానం చేసుకోవడానికి పారిపోలేదు" అన్నాను.

ఆయనకి కోపం వస్తుందనుకున్నాను కానీ రాలేదు.

“అవునా?”

ఏమీ తెలీని మనని ఇలా అడిగేవారు జీవితంలో అన్నీ తెలిసిన వాళ్ళయివుంటారు.

"అవును ఇష్టపడిన అమ్మాయిని, పెళ్ళి చేసుకుంటే పోట్లాడుకుని విడిపోతారేమో.. పిల్లలు పుడితే కష్టం ఏమో. కలిసి సహజీవనం చేద్దాం. చట్టాన్ని మధ్యలోకి తీసుకురావద్దు. టైం వేస్ట్. మనశ్శాంతి వుండదు అంటున్నాడు" అన్నాను.

ఆయన ఆలోచనలో పడినట్టు కళ్ళు మూసుకున్నారు.

గణగణమంటూ గంటు మ్రోగింది.

"రండి భోజనశాలకి వెళ్దాం" అన్నారు.

"ఇలా మఠం నిద్రా సత్రం తిండితో మీ అబ్బాయి జీవితం గడపకూడదు అంకుల్... అతనికి జీవితం మీద భరోసా కల్పించండి. తాళి కట్టిన మీ సహధర్మచారిణి ఒంటరితనాన్ని దూరం చెయ్యండి. హిందూ ధర్మంలో, వేదాల్లో ఎక్కడా విడాకుల గురించి రాయబడిలేదు కదా!" అన్నాను.

"దేవకి ఎలావుందీ?" ఎటువంటి ఉద్విగ్నతా లేదు ఆయన స్వరంలో.

కొంపదీసి ఈయన నిజంగానే రుషి కాదుకదా! మంత్రజలం తీసి కమడలంలో నుండి నా పైన జల్లి ఏ పిట్టగానో మార్చెయ్యరుకదా అనిపించింది.

"మీ గురించి ఆలోచించి బాధపడుతుంటారు" అన్నాను.

"ఏమనీ?" అడిగారు.

"నాకు వీడున్నాడు. ఆయనకెవరు అని" అన్నాను

ఒక్క నిమిషం ఆగి కళ్ళజోడుతీసి కళ్ళు తుడుచుకుని మళ్ళీ పెట్టుకున్నారు.

"ఆమెదే విజయం" నవ్వారు.

అమ్మ కళ్ళల్లో వెలుగు చూసాను.

అభద్రతనీ అనిశ్చలత్వాన్నీ పటాపంచెలు చేస్తూ అమ్మ మనసారా నవ్వడం చూసాను.

మెత్తని తన కాశ్మీర్ సిల్క్ చీరని బయటకి తీసి, వాటిలో పెట్టిన మొగలి పూలని వాసన చూసి, గతాన్ని శ్వాసించడం చూసాను.

దీపావళినాటి ప్రమిదల్లా అమ్మకళ్ళు వెలగడం చూసాను. గడియారం మరిచిపోయి తిరగదేమోనని అక్కడే కాపలా కాయడం చూసాను.

అమ్మ చక్రాలతో కాకుండా మనస్సులో పరిగెత్తడం చూసాను.

ఇదంతా నీ వల్లే అనుకుంటే ఎంత ఆనందంగా వుందో.. కాదు..కాదు...ఎంతో గర్వంగా వుంది తెలుసా?

ఇంత సంతోషానికి కారణమైన నీముందు వాలి నిన్ను నా చేతుల్లోకి తీసుకుని...ఉహూ! చెప్పడం కాదు. చేసి చూపిస్తాను. వచ్చెయ్యనా?

అయ్యో నీకు అసలు సంగతి చెప్పనేలేదు కదూ?

నాన్న వచ్చారు. అమ్మా నాన్నా నా దగ్గరే ఉన్నారు. నా గెస్ట్ హౌస్ ని ఇల్లులా మార్చారు. ఇక్కడే హైదరాబాద్ లో ఉన్నారు.

నీకన్నీ తొందరరే. అందుకే అనుకున్నది అనుకున్నట్లుగా వెంటనే చేసేస్తావ్.

థాంక్యూ డార్లింగ్! నా రుష్యేంద్రమణీ!

**నీ**

**ద్వారక.**

ఉత్తరం రాసాడు. ఈమెయిల్ కూడా కాదు. కొరియర్‌లో ఉత్తరం వచ్చింది. ఎవరన్నారు అతనికి భావుకత్వం లేదని. ఆ ఉత్తరం నా బుగ్గకి ఆనించుకుంటే అతను రాయలేని సంగతులెన్నో చాలా చెవిలో గుసగుసలాడాయి. 'ఛీ పాడు'....'ఛీ...వూర్కో'అనిపించేటన్ని సంగతులు.

అమ్మ ఆపరేషన్ అయిపోయాక గత కొద్దికాలంగా నేను చేసిన నా ప్రయత్నాలన్నీ ఫలించాయి. దేవేంద్రగారు నా మాట విని దేవకిగారిని కలవడం నాకెంతో ఆనందాన్నిచ్చింది.

ఎక్కడో వాన పడుతోంది. మట్టివాసనలు వీస్తున్నాయి. అమ్మ రేడియోలోంచి గాల్లో తేలినపాట ఒకటి నా చెవిలో వాలింది

**" ఎందుకే నీకింత తొందరా?**

**ఓ చిలుక.. నా చిలుక ... ఓ రామచిలుక**

**వయ్యారి నా చిలుక**

**గారాల నా మొలక... ఎందుకే నీకింత తొందర?"**

*ఉపసంహారం*

అర్విన్‌తో పరిమళ విడాకులూ, ధీరజ్‌తో పెళ్ళీ జరిగిపోయాయి. మందాకినిదే పందిట్లో హడావిడంతా. కొత్త గౌను వేసుకుని.

హనీగాడు నాకో అమెరికన్ మరదల్ని రెడీ చేసాడు.

దేవకీ ఆంటీ, దేవేంద్రనాథ్ అంకుల్ దగ్గర ఆరునెలలు ఉండడానికొచ్చారు. తర్వాత అంకుల్ ఆంటీ దగ్గరకి వెళ్తారు.

నేనూ ద్వారకా పెళ్ళిచేసుకోడానికి చాలా చాలా ఆలోచిస్తూ వుండగానే బుజ్జిగాడు 'నేనున్నా' అన్నాడు. ద్వారక బెట్టు చేస్తాడనుకున్నా.

పెళ్ళి మాత్రం సింపుల్‌గా చేసుకుందాం. పిచ్చి ఖర్చులు లేకుండా సరేనా?" అన్నాడు.

గోపాలక్రిష్ణమూర్తీ, వసుంధరా, అయినా తగ్గలేదు అనుకోండి. పెద్ద పెట్టున రిసెప్షన్ ఇచ్చారా.. డిన్నర్‌లో ఆ దోశలు వేసేవాడి ముందు ప్లేట్ పట్టుకుని నిలబడ్డ గోపాలం బావ కనిపిస్తే నాకు ఒకటే నవ్వు... ఆపుకోలేకపోయా. యాషికా ఓ పంజాబీ సింగ్‌ని పెళ్ళి చేసుకుని కెనడా వెళ్ళిపోయింది.

అన్నట్టు గేరీ ఫోన్ చేసి నేను పరీక్షలు పాసయిన విషయం, తర్వాత సినిమాలో తనతో పని చెయ్యాలని చెప్పాడు.

మా బుజ్జిగాడికి ఇంకా పేరు పెట్టలేదు. ఏదో ఒకనాడు గబుక్కున తన పేరు ఇదీ, అని డిసైడ్ అవుతాడని అందరంఎదురు చూస్తున్నాం. అందాకా వాడిని బ్లూ బెర్రీ, చెర్రీ, బుజ్జీ, కన్నా అని పిలిచేస్తున్నారు. ఇవే స్థిరపడిపోతాయేమోనని అదో వర్రీ నాకు.

"రుష్యేంద్రమణీ!" సిస్టర్ పిలుస్తోంది. అబ్బా! అంత పేరు పెట్టి పిలవాలా? మళ్ళీ వాంతులు ఖర్మ. ఆస్పత్రికి రాక తప్పలేదు.

"రుష్యేందర.."

"ఆగమ్మా. వచ్చేస్తున్నా" పరిగెత్తా. చుట్టూ జనాలని క్రీగంట చూసాను. వాళ్ళ మొహాల్లో నవ్వు.

నా పేరు వినేనా?

ఏమో.. నవ్వారుగా అంతే చాలు. అందరూ నవ్వుతూ వుండాలి.

సర్వేజనా సుఖినోభవంతు!

సర్వేలో లేని వాళ్ళు కూడా సుఖినోభవంతు..

(సమాప్తం)

COMMENTS